నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | JANAGAON

## వరద బాధితులకు భరోసా ఏదీ?


ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

- ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సర్వం కోల్పోయినా రూ. పదివేలు ఇస్తామనడం కరెక్ట్ కాదు
- ఇంత వరకు నష్టం అంచనా వేయని సర్కారు
- వెంటనే పరిహారం అందించి న్యాయం చేయాలి
- మల్కాజిగిరి ఎంపీ రాజేందర్

మహబూబాబాద్ రూరల్/తాడ్వాయి/గోవిందరావుపేట/మరిపెడ, సెప్టెంబర్ 6: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం, మానుకోట జిల్లాలను భారీ వర్షం అతలాకుతలం చేసిందని, నిరుపేదలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ సర్కారు వారికి ధైర్యం కల్పించి ఆదుకోవడం మరిచిందన్నారు. ఇంత వరకు ఎంత నష్టం జరిగిందనే అంచనా వేయలేదన్నారు. సర్వం కోల్పోయిన వారికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని అన్నారు. జిల్లాలో సీతానగరం తండా, రావిరాల గ్రామంలో ప్రజలు తినడానికి ఆహారం లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. బాధితులకు పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్రమే నిధులివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నాలు చేస్తుందని, వెంటనే మానుకోవాలన్నారు. వరద బాధితులకు ఎల్లప్పుడూ కేంద్రం అండగా ఉంటుందన్నారు.

*విధ్వంసానికి గురైన అటవీ ప్రాంతం సందర్శన*

తాడ్వాయి మండలంలోని మేడారం దారిలో సుడిగాలి సృష్టించిన విధ్వంసంతో 500ఎకరాల్లో ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఈటల సందర్శించారు. ఎన్ని చెట్లు నేలకూలాయి? దేని కారణంగా అడవి ధ్వంసమైందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 163వ జాతీయ రహదారిలోని జనగలంచ వాగును పరిశీలించారు. అనంతరం పిడుగుపాటుకు గురై మృతి చెందిన నార్లాపురానికి చెందిన మహేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. తిరుగుప్రయాణంలో బాంబుల ఒర్రెను పరిశీలించారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా పసమీపంలోని గుండ్లవాగు వద్ద పడిన రోడ్డు కోతను, ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, పార్టీ జిల్లా అధ్యక్షులు వైవీ రావు, బలరాం, మాజీ ఎంపీ సీతారాంనాయక్, నాయకులు ధర్మారావు, యాప సీతయ్య, మోసంగి మురళి, శశిధర్‌రెడ్డి, మదన్, సతీశ్, నాగమణి, ఇందుభారతి, అజ్మీరా ప్రహ్లాద్, జాడి వెంకట్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కర్ర సాంబశివుడు, నామవరపు విజయలక్ష్మి ఉన్నారు.

## ప్రధాన సూత్రధారి అరెస్ట్

### నకిలీ సర్టిఫికెట్ల బాగోతంలో తప్పించుకు తిరుగుతున్న మన్యం సిద్ధయ్య

మట్టెవాడ, సెప్టెంబర్ 6: నకిలీ సర్టిఫికెట్ల బాగోతంలో ప్రధాన సూత్రధారి మన్యం సిద్ధయ్యను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని కోర్టులో హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో ప్రధాన సూత్రధారి అయిన మన్యం సిద్ధయ్య తప్పించుకు తిరుగుతుండగా పట్టుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మట్టెవాడ ఎస్సై రవీందర్ వివరాలు వెల్లడించారు. వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారులతో సిద్ధయ్య చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో మరో నిందితుడు గోవింద సతీశ్‌కుమార్‌తో కలిసి సర్టిఫికెట్లు ఇప్పిస్తానని ఆఫీసుకు వచ్చే వారికి నకిలీవి ఇచ్చి డబ్బులు పంచుకునేవారు. మండిబజార్‌కు చెందిన ఖాజా, మహ్మద్ అజారుద్దీన్, కాజీపేటకు చెందిన సయ్యద్ సాబీర్, ఫసియుద్దీన్ ఖాద్రీ, చుక్కల సునీత, మాకుల దామోదర్ ఫ్యామిలీ మెంబర్స్‌కు సర్టిఫికెట్లతో పాటు ఎనుమాములకు చెందిన పస్తం సతీశ్‌కు మనీ ల్యాండింగ్‌కు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇటీవల పస్తం సతీశ్ మనీ ల్యాండింగ్ సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేయాలని దరఖాస్తు చేసుకోగా పరిశీలించిన తహసీల్దార్ ఇక్బాల్ సర్టిఫికెట్లు నకిలీవని గుర్తించి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## రావయ్యా.. గణపయ్యా


రెడ్డికాలనీలోని మండపంలో వినాయకుడు


హనుమకొండ చౌరస్తాలో పూజ సామగ్రి, వినాయకులను కొనుగోలు చేస్తున్న భక్తులు

- నవరాత్రోత్సవాలకు ఊరూవాడా సిద్ధం
- వాడవాడలా కొలువుదీరనున్న నాయకులు
- నేడు వినాయక చవితి

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 6 : గణపతి నవరాత్రోత్సవాలకు ఊరూవాడా సిద్ధమైంది. ఆదిదేవుడు విఘ్నేశ్వరుడు కొలువయ్యే వేళ రానే వచ్చింది. శనివారం వినాయక చవితిని పురస్కరించుకొని వాడవాడలా గణనాథులు కొలువుదీరనుండగా తొమ్మిది రోజుల పాటు పూజా కార్యక్రమాలు, ప్రత్యేక అలంకారాలు, భక్తి గీతాలతో మండపాల వద్ద సందడి నెలకొంది. ఇందుకోసం వారం ముందునుంచే నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలు, డెకరేషన్స్‌తో అలంకరించి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోళ్లతో జిల్లాకేంద్రాలు, పట్టణాల్లోని మార్కెట్లన్నీ కిటకిటలాడాయి.

*మట్టి విగ్రహాలనే పూజిద్దాం*

గణపతిని తొలుత ఆరాధించడం వల్ల చేపట్టిన కార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగడమే కాక విజయంతో పాటు గమ్యాన్ని, లక్ష్యాన్ని పొందవచ్చనేది ప్రజల విశ్వాసం. విఘ్నాలు తొలగించే దేవుణ్ణి కొలిచేందుకు ప్రకృతికి ఎన్నో విఘ్నాలు కలిగిస్తున్నాం. అంతేకాదు వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కలుషితమవుతోంది. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. మట్టి విగ్రహాలతో పాటు పూజించిన పత్రాలను నీటిలో వేయడం వల్ల విగ్రహం మెల్లగా కరిగి నీటిలో కలిసిపోతుంది. పత్రాలన్నీ ఆయుర్వేద, ఔషధ గుణాలు కలిగినవే. అవి 23గంటల వ్యవధి తర్వాత వాటిలోని ఔషధ గుణాలు, ఆల్కలాయిడ్స్‌ను ఆ జలంలోకి వదిలేస్తాయి. బ్యాక్టీరియాను నిర్మూలించి, జలాల్లో ఆక్సిజన్ శాతాన్ని పెంచుతాయి. ఫలితంగా నీరు శుద్ధి అవుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.



## వరద విలయానికి అంతా తారుమారు

- నామరూపాల్లేకుండా చెరువులు, పంట చేలు
- కొట్టుకొచ్చిన ఇసుక, కంకర కుప్పలు
- మానుకోట జిల్లాలో 85 చెరువులకు గండ్లు
- ఖాళీ అయిన జల వనరులు
- ఒక్కో రైతుకు లక్షల్లో నష్టం
- సాగుకు అనుకూలంగా మార్చేదెవరు?
- ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్

వరద పోటుకు పంట చేలు, చెరువులు నామరూపాల్లేకుండా మారాయి. అతి భారీ వర్షాలతో పొలాల్లో ఇసుక మేటలు, తారురోడ్డు ముక్కలుచెక్కలై కొట్టుకొచ్చాయి. ప్రవాహ ఉధృతికి చెరువులకు గండ్లు పడి నీరంతా వృథా పోవడంతో నేలంతా మైదానంలా మారి పెద్ద పెద్ద రాళ్లు తేలాయి. ఇలా మున్నటి ప్రకృతి బీభత్సానికి మానుకోట జిల్లాలో 85 చెరువులు తెగిపోవడంతో జలవనరులన్నీ ఖాళీ కాగా, చాలాచోట్ల పంటలను ముంచేసి, ఇసుక మేటలు వేసి రైతన్నకు అపార నష్టం మిగిల్చింది. పంటలను కోల్పోయి, సాగుభూమి అక్కరకు రాకుండా కావడం అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. ఇప్పటికే దీంతో ఒక్కో రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లిన నేపథ్యంలో ప్రభుత్వమే ఆదుకోవాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది.

- మహబూబాబాద్, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ)


నెల్లికుదురు మండలం ఆలేరు పెద్ద చెరువు తెగిపోవడంతో సుమారు 10 ఎకరాల్లో కుప్పలు కుప్పలుగా పడి ఉన్న చెరువులోని పెద్ద రాళ్లు


నెల్లికుదురు: మొండివాగు ఉప్పొంగడంతో రోడ్డు తెగి పొలాల్లోకి కొట్టుకొచ్చిన డాంబర్, రాళ్లు

# పొలాలను ముంచేసి రాళ్లతో నింపేసి..

భారీ వర్షాలతో మానుకోట జిల్లాలో గ్రామాలు, తండాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే చాలాచోట్ల ఇళ్లు కూలిపోయి, కొన్ని బురద నీటి పాలు కాగా సామగ్రి, నిత్యావసరాలు, పశువులు, గేదెలు, గొర్రెలన్నీ వరద పాలయ్యాయి. వరదలతో జిల్లాలో 85 చెరువులు గండ్లు పడ్డాయి. వీటిలో 40 పూర్తిగా తెగిపోయాయి. అలాగే చెలకల్లోకి ఉప్పెనలా వచ్చిన వరదతో పత్తి, మిర్చి, వరి, మక్కజొన్న తదితర పంటలన్నీ కొట్టుకుపోయాయి. పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరి లక్షలు పోసి పెట్టుబడి పెట్టిన రైతులకు అంతులేని నష్టాన్ని మిగిల్చింది. వాటిని తొలగించి, సాగుకు అనుకూలంగా మార్చుకోవడం రైతులకు కత్తి మీద సాములా మారింది. వీటిని రైతులు తొలగించాలంటే ఖర్చుతో కూడిన పని. వరద నష్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక ఉపశమనం కోసం ఓదార్చడం తప్ప వారు కన్నీళ్లు తుడిచింది లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎకరాకు లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కింద ఎకరాకు చెల్లిస్తామని చెప్పిన రూ.10వేలు ఏ మూలకు సరిపోతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### రూ.10వేలు ఎటూ సరిపోవు..



ఆకేరు వాగు వరదతో సర్వం కోల్పోయాం. రెండు ఎకరాల మిర్చి తోట, ఒక ఎకరం వరి వేశాను. పంటతో పాటు భావి వద్ద ఉన్న 40 పైపులు, 10 ఎరువుల బస్తాలు కొట్టుకుపోయాయి. మాకు జీవితంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. లక్షల పెట్టుబడి వరద పాలైయింది. రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలి. అరకొరగా పరిహారం ఇస్తే ఏమి సరిపోతుంది.

– జాటోత్ మంగమ్మ, రైతు, దుబ్బతండా, డోర్నకల్ మండలం


నెల్లికుదురు: ఆలేరు పెద్ద చెరువు తెగిపోవడంతో నీరు లేక వెలవెలబోతున్న చెరువు

## మక్కలకు రికార్డు రేటు

- ఎనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ.3015
- రాష్ట్ర మార్కెట్ చరిత్రలోనే అత్యధికం



రైతు సురావు కిషన్‌రావు

కాశీబుగ్గ, సెప్టెంబర్6: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మక్కలకు రాష్ట్రంలోనే రికార్డు రేటు పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2090 ఉండగా, నెల రోజుల నుంచి క్రమక్రమంగా పెరుగుతున్నాయి. ఈ సీజన్‌లోనే అత్యధికంగా క్వింటాకు రూ.3015 ధర పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర మార్కెట్ చరిత్రలోనే ఈ ధర రికార్డు అని, ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. హనుమకొండ జిల్లాలోని నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన సురావు కిషన్‌రావు 116 క్వింటాళ్ల మక్కలు తీసుకురాగా హరికిషన్ గోపికిషన్ లాహోటి అడ్తి ద్వారా వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ కరీదు వ్యాపారి కొనుగోలు చేశారు. మక్కలకు అధికంగా ధరలు పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మార్కెట్‌కు 92,343 క్వింటాళ్ల మక్కలు వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## చెరువులో ఈదుతూ.. స్తంభాలు ఎక్కుతూ

- తీగలు సరిచేసి కరెంట్‌ను పునరుద్ధరించిన ఎల్ఎం, జేఎల్ఎంలు
- అభినందించిన అధికారులు, సిబ్బంది, ప్రజలు

ఖానాపురం, సెప్టెంబర్ 6: మండలంలోని మంగళవారిపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, సిబ్బంది చెరువులో ఈదుకుంటూ వెళ్లి స్తంభాలను ఎక్కి పునరుద్ధరించారు. గ్రామ శివారులోని ఊరు చెరువు మధ్యలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాల మధ్య ఇన్సులేటర్ ఫెయిలై కండక్టర్ తెగిపడినట్లు ఎల్ఐ వజీర్‌పాషా, జేఎల్ఎం బషీర్‌లు గుర్తించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండి ఉంది. విద్యుత్ మరమ్మతులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశంతో తెప్ప సాయంతో చెరువులోకి వెళ్లి పనులు చేద్దామని అనుకున్నా తెప్ప దొరకలేదు. మరోపక్క ఆలస్యం అవుతుండడంతో చేసేదేమీలేక ఎల్ఐ, జేఎల్ఎంలు సామగ్రి చేతపట్టుకుని ఊరచెరువులో మొదట 50 మీటర్లు ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి ఇన్సులేటర్‌ను అమర్చారు. అక్కడి నుంచి మరొక 50 మీటర్లు ఈదుకుంటూ వెళ్లి మరో విద్యుత్ స్తంభం ఎక్కి ఇన్సులేటర్‌ను, తీగలను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించి మళ్లీ ఈదుకుంటూ వచ్చారు. వజీర్‌పాషా, బషీర్‌లు చేసిన సాహసానికి విద్యుత్ అధికారి విజయ్‌భాస్కర్, సిబ్బందితోపాటు మండల ప్రజలు అభినందించారు.



మంగళవారిపేట ఊరచెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి తీగలు సరిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్ బషీర్, లైన్ ఇన్‌స్పెక్టర్ వజీర్‌పాషాను అభినందిస్తున్న విద్యుత్ సిబ్బంది

























